ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 8 నవంబరు 2024 | 5





కాడెడ్ల బండి ఇక 'షో' బొమ్మ

ప్రత్యేక కథనం..6లో

పుంత రోడ్లు ధ్వంసం

గృహ నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఎడ్ల బండితో పాటు ట్రాక్టర్లకు కూడా ఉచిత ఇసుకకు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈవిధానం వల్ల లబ్ధిదారులకు చేరే ప్రయోజనం కంటే రైతులకు జరిగే నష్టం అధికంగా కనబడుతోంది. ఆ ట్రాక్టర్లు రైతులు ఎంతో అపురూపంగా చూసుకునే పుంత రోడ్లను ధ్వంసం చేస్తున్నాయి. ఎందుకూ పనికిరాకుండా తయారవుతున్నాయి..

అలమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):

- గ్రామీణ రహదారులను దున్నేస్తున్న ఇసుక ట్రాక్టర్లు
- పరిధికి మించి తోలకాలు..
- కుంగిపోతున్న పుంత రోడ్లు
- వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు రైతుల ఇబ్బందులు





బడుగువానిలంకలో ట్రాక్టర్లు రాకపోకలతో పుంతరోడ్లు ధ్వంసమవుతున్న దృశ్యాలు

ఇష్టారాజ్యం

ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరిగితే ఎవరికీ పెద్దగా నష్టం ఉండదు. కాని ఎక్కడ వీలుంటే అక్కడ తోలుకునే వెసులుబాటు ఇవ్వడంతో ట్రాక్టర్ల నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ ఇసుకను తవ్వతూ వారికి నచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దొరక్క అల్లాడిపోయిన లబ్ధిదారులు ట్రాక్టర్ ఇసుక రూ.3000 నుంచి 4000 వరకు కొనడానికి కూడా వెనకాడడం లేదు. ఇది అదునుగా చేసుకుని ఎక్కడెక్కడ నుంచో ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని పలువురు ఈ ఉచిత ఇసుకతో లబ్ధిపొందుతున్నారు. ఇదిలా ఉంటే ట్రాక్టర్లు రాకపోకలతో రైతులు ఎంతో జాగ్రత్తగా చూసుకునే పుంత రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. రైతులకు పంట పండించడానికి అవసరమైన ఎరువులు వంటివి తీసుకెళ్లడానికి అలాగే పండించిన పంటను మార్కెట్‌కు తరలించడానికి వీలు లేకుండా ఈ ట్రాక్టర్లు అడ్డంకిగా మారుతున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తరలింపు జరుగుతుండడంతో ఈ రోడ్డుకు ఇరువైపులా ఉండే పంటలన్నీ మట్టికొట్టుకుపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఆగడాలకు అంతేలేదు

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో ఈ ట్రాక్టర్ల నిర్వాహకుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. అంతంత మాత్రంగా ఉండే ఈ పుంతరోడ్లు ఈ ట్రాక్టర్ల తాకిడికి పెద్దపెద్ద గోతులు పడిపోయి రైతులకు తీవ్ర నష్టం చేకూర్చుతున్నాయి. ఆయా ప్రాంత రైతులు డబ్బులు పోగేసుకుని గ్రావెల్ రోడ్డు నిర్మించుకుంటే ఈ ఇసుక ట్రాక్టర్లు వాటిని ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఈ ట్రాక్టర్లు తరచూ దిగబడిపోతున్నాయని వీటిని బయటకు తీసే ప్రక్రియలో పక్కనున్న వాణిజ్య పంటలు పూలు, కూరగాయ పంటలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ఇవ్వడం తప్పులేదని కానీ ఆ విధానం వల్ల రైతులకు నష్టం జరగకుండా చూడాలని వేడుకుంటున్నారు. చిన్నపాటి వర్షం వస్తే ఇక సైకిల్‌పై కూడా తమ పొలాలకు వెళ్లడానికి వీలు లేకుండా ఈ ట్రాక్టర్లు పాడు చేస్తున్నాయని వీటిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఇక్కడికి పలుసార్లు తాము ఈ ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ట్రాక్టర్ డైవర్లు, నిర్వాహకులు తమపై దాడులు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారులదే పెత్తనం

ప్రభుత్వం ట్రాక్టర్లకు ఉచిత ఇసుక ప్రకటిస్తే దళారులు ఆ పథకాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. ఓపక్క తమ బాట పాడైపోతుందని రైతులు గగ్గోలు పెడుతుంటే ఈ దళారులు బాట నిర్వహణ పేరుతో ట్రాక్టరుకు రూ.300 నుంచి 500 వరకు గుంజుకుంటున్నారు. అలాగే లోడింగ్ కూడా తాము నిర్ణయించిన మేరకే వేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేగాక వారికి కావాల్సిన ట్రాక్టర్లను లైన్లో కాకుండా నేరుగా వెళ్లిపోయే వెసులుబాటు కూడా ఈ దళారులు చేపడుతున్నారు. దీనివల్ల వారికి పెద్ద మొత్తంలో డబ్బులు ముడుతున్నందున రాత్రి పగలు తేడా లేకుండా అక్కడ పెత్తనం చెలాయిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లుపై లోడు చేసి ఈలోడు వారికి నచ్చిన చోట దించి వస్తేనే మరో లోడు వేస్తారని లేదంటే ట్రాక్టర్ రానీయమని బెదిరింపులు కూడా చేస్తున్నారు.

బడుగువానిలంకలో లంక భూములలో తవ్వకాలు



డీఈవో ఆకస్మిక తనిఖీ



తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈవో

ముమ్మిడివరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను డీఈవో షేక్ సలీంబాషా గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అపార్ కార్డు జనరేషన్, ఆధార్ అప్‌డేట్ విషయాలను పరిశీలించారు. ఆయన వెంట సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్‌ఎం బీర హనుమంతరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు మరో అవకాశం 7

భారీగా టెండర్లు

ఇసుక తరలింపు హక్కులను దక్కించుకునేందుకు పోటాపోటీ



కలెక్టరేట్‌లో సందడి

- ఇసుక ర్యాంపుల కోసం భారీగా టెండర్ల దాఖలు
- సిండికేట్ అయిన కాంట్రాక్టర్లు
- అయినా సరే వందల సంఖ్యలో..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని ప్రాంతాల్లోని ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక తీసి స్టాకు యార్డుకు తరలించేందుకు అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం టెండర్లను స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 12 ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను తీసి స్టాకు యార్డులకు తరలించేందుకు గత నెల 31వ తేదీన జిల్లా శాండ్ కమిటీ టెండర్లు స్వీకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. వారం రోజులు వ్యవధి ఇచ్చి జారీ చేసిన ఈ నోటిఫికేషన్ గడువు గురువారం ముగియడంతో పెద్ద సంఖ్యలో టెండరుదారులు ఇసుక ర్యాంపుల కోసం తమ టెండర్లను బాక్సులో వేశారు. భారీగా టీడీపీతో పాటు ఇతర కూటమి నాయకులు సిండికేట్లుగా మారి ఆ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా పోటీపడ్డారు. పెద్ద సంఖ్యలో టెండరు షెడ్యూలు దాఖలైనట్టు అధికారులు చెబుతున్నప్పటికీ సమయాభావం ముగియడంతో ఒక్కసారిగా టెండరుదారులు పోటెత్తి బాక్సులో టెండర్లు వేశారు. దీంతో ఏయే ర్యాంపునకు ఎన్ని టెండర్లు దాఖలయ్యాయో అధికారులు సైతం నోట్ చేసుకోలేని పరిస్థితి. జిల్లాలో అంకంపాలెం, నార్కేడుమిల్లి, పులిదిండి, పొడగట్లపల్లి 2 ర్యాంపులు, వద్దిప్పర్రు 2 ర్యాంపులు, ఆలమూరు, ఊబలంక, తాతపూడి, కపిలేశ్వరపురం రెండు ర్యాంపులు, ఆత్రేయపురం, రావులపాలెం తదితర ర్యాంపులకు టెండర్లు భారీగా దాఖలయ్యాయి. కూటమి నేతలే సిండికేట్ల అవతారమెత్తి భారీగా టెండర్లు దాఖలు చేయడం ద్వారా ఇసుక కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇసుక ర్యాంపుల్లో బాట వేసి ర్యాంపు నుంచి ఇసుకను వాహనాల్లో లోడ్ చేసి ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్ పాయింట్ల వద్దకు ఇసుకను తీసుకువెళ్లి అన్‌లోడింగ్ చేయాలి. ఆ తర్వాత అక్కడి నుంచి వినియోగదారుడు తీసుకువెళ్లేందుకు వీలుగా వాహనంలో ఇసుకను లోడ్ చేసేందుకు నిర్వహణ కోసం ప్రభుత్వం ఈ టెండర్లు పిలిచింది. జిల్లాలో ఇసుక వ్యాపారులు, రవాణాదారులు నుంచి మంచి స్పందన లభించడంతో వందల సంఖ్యలోనే టెండర్లు దాఖలైనట్టు తెలుస్తుంది. అయితే అందరూ వ్యూహాత్మకంగా సిండికేట్ అయి ఈ టెండర్లు దాఖలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



టెండర్ దాఖలు చేస్తున్న ఔత్సాహికుడు

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు చిత్రపటం బహూకరణ

అంతర్వేది, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం గురువారం అన్నదాన ట్రస్టుకు ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్లకు చెందిన బొండాడ సుబ్బరాజు, రాజీ, సుధీర్ రూ.1,01,116 విరాళంగా అందించారు. విరాళం అందించిన దాతకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో కిరణ్, అన్నదానం స్వామి, విజయ్, విరాళ దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధైర్యాన్ని నింపేందుకు కృషి



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల్లో ధైర్యాన్ని నింపి వారికి అండగా నిలిచేందుకు మహిళా సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ప్రస్తుత కాలంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలీసులు అంటే భయాన్ని వీడి సోదరభావంతో ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియచేయాలని ఆయన సూచించారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ కడియం శిరీష అధ్యక్షతన మహిళా సంరక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశలో విద్యార్థినులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. సెల్‌ఫోన్లు వినియోగంలో ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులు ఉన్నారని వాటికి అడ్డుకట్ట వేసేందుకు మన వంతుగా విద్యార్థినులు సహకరించాలన్నారు. ఎవరెవరివో ఫొటోలు పెట్టి చాటింగ్ చేస్తూ ట్రాప్ చేస్తున్న వ్యక్తుల పట్ల ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. ముందుగా అదనపు ఎస్పీ ఏవీఆర్పీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడి పోలీసులు మీకు ఆత్మీయులని మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్ఐలు ఎన్ఆర్ కిశోర్‌బాబు, కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి సీఐలు శ్రీనివాస్, రాజశేఖర్, మహిళా సమాఖ్య సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలు, పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థినులకు ధైర్యాన్ని నింపేందుకు మహిళా సంరక్షణ కార్యక్రమాలు రెండు నెలల పాటు నిర్వహించనున్నట్టు ఎస్పీ కృష్ణారావు తెలిపారు.

హైవే విస్తరణ పనులకు 11 నుంచి సర్వే

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెం నుంచి అమలాపురం వరకు జాతీయ రహదారి 216-ఇ విస్తరణ పనులకు ఈ నెల 11 నుంచి సర్వే నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం రెవెన్యూ, సర్వే, రహదారులు, భవనాల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. అమలాపురం, అంబాజీపేట, కొత్తపేట, అయినవిల్లి, రావులపాలెం మండలాల మీదుగా 216-ఇ జాతీయ రహదారి సుమారు 23 మీటర్ల వెడల్పుతో విస్తరించడానికి డీపీఆర్ రూపొందించనున్నట్టు ఆమె తెలిపారు. తొలుత విస్తరణకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియపై ఈ నెల 11 నుంచి వారం రోజుల పాటు పూర్తిగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ మార్గం వెంబడి ఉన్న పైపులైన్లు, ట్రాన్స్‌కో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర కట్టడాలను గుర్తించి వాటి మార్పుకు ఆయా శాఖల ద్వారా నివేదికలను తయారుచేసి జాతీయ రహదారుల శాఖకు సమర్పించాలన్నారు. జలవనరుల శాఖ అధికారులు పంటకాల్వ వెంబడి ఉన్న భూముల సర్వే నంబర్ల విస్తీర్ణం, ఇతర వివరాలను ఎన్‌హెచ్ అధికారులకు అందించాలన్నారు. జియో కోఆర్డినేట్స్‌తో సర్వే ప్రక్రియను నిర్వహించాలన్నారు. జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు ఐదు మండలాల నుంచి సర్వేయర్లను నియమించాలని, ఎన్‌హెచ్ అధికారులు తమ సాంకేతిక సిబ్బందిని సర్వే ప్రక్రియలో చేర్చాలన్నారు. జాతీయ రహదారి వెంబడి 5.8 కిలోమీటర్ల మేర గ్రీన్స్ ఫీల్డు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విస్తరణలో ఆక్రమణలు ఉంటే తొలగించాలన్నారు. సమావేశంలో జాతీయ రహదారుల విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఇ.శ్రీనివాసులు, డివిజనల్ ఇంజనీర్ టి.నిక్కీక్రజ్, ఏఈ నెల్ల శ్రీను, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ రవికుమార్, జలవనరులశాఖ డివిజనల్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అధికారులతో జేసీ చర్చలు

గ్యాస్ సిలిండర్ల పథకంపై అనుమానాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్

అమలాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై ఎందరికో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం 1967 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని. అర్హులైన వారందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దీపం-2 పథకంపై కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. తెలుపురంగు రేషన్‌కార్డుతో పాటు ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులకు గ్యాస్ భారాన్ని తగ్గించేందుకు ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. మార్చి 31లోగా ఎప్పుడైనా మొదటి గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చునని ఆమె స్పష్టం చేశారు. ఆధార్, రేషన్‌కార్డు, ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు గ్యాస్ డెలివరీ బాయ్ కూడా తగిన సహకారం అందిస్తారని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ పొందిన 48 గంటలలోపు తిరిగి సబ్సిడీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని, ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లకు సంక్షిప్త సమాచారం వస్తుందన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో తీసుకువచ్చిన బాయ్‌కి వినియోగదారులు ఓటీపీ నంబరును చెప్పాల్సి ఉందన్నారు. 1967 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి తాము దీపం-2 పథకానికి అర్హులమా, అనర్హులమా అన్న కోణంలో వినియోగదారులు తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చునన్నారు. ఒక కుటుంబంలో ఎన్ని గ్యాస్ కనెక్షన్లు ఉన్నా ఏడాదికి ఒక కనెక్షన్‌కు మాత్రమే మూడు ఉచిత సిలిండర్ల పథకం వర్తిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

దాళ్వాలో వరిసాగుకు యాక్షన్ ప్లాన్

వ్యవసాయాధికారి బోసుబాబు

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాళ్వా సాగుకు సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకుడు బోసుబాబు తెలిపారు. మండపేట మండలం ద్వారపూడి వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. రామచంద్రపురం, మండపేట ఆలమూరు, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లో కోతలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నెల 15 నుంచి జిల్లా అంతటా కోనసీమలో కోతలు ముమ్మరంగా జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. జిల్లాలో 1.53 లక్షలు ఎకరాల్లో వరిసాగు చేశారు. ఎకరాకు దిగుబడి 30 నుంచి 35 బస్తాల వరకు వస్తుంది. ఇప్పటికే 25 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. మిగిలినవి నవంబరు నెలాఖరు.. డిసెంబరు తొలివారంలో పూర్తవుతాయి. దాళ్వాలో జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధం చేశామని బోసుబాబు తెలిపారు. దాళ్వాలో 1.72 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేస్తుండగా అందులో 90 శాతం వెదజల్లే విధానం ద్వారానే నాట్లు జరిగిపోతాయన్నారు.



పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

బ్రిడ్జి నిర్మాణ పనుల పూర్తికి రూ.76 కోట్లు

కలెక్టర్ మహేష్‌కుమార్

ఐ.పోలవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జి.మూలపొలం-పల్లంకుర్రు బ్రిడ్జి పునరుద్ధరణకు రూ.76 కోట్లు మంజూరైనట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఐ.పోలవరం మండలంలో గోదావరి నదీ పాయపై నిర్మాణంలో ఉన్న జి.మూలపొలం బ్రిడ్జిని గురువారం ఆయన పరిశీలించారు. 2008లో ప్రారంభమైన బ్రిడ్జి పనులు మధ్యలో నిలిచిపోయాయన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో రహదారులను గుంతల రహిత రహదారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయన వెంట ఎస్ఈ బి.రాము, డీఈఈ వర్మ, జూనియర్ ఇంజనీర్ ఆశ్రిత ఉన్నారు.

'గ్లోబెల్' దత్తత గ్రామంగా ఆత్రేయపురం



గ్లోబెల్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఆత్రేయపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నామని అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబెల్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ భూపతిరాజు పెండేటి తెలిపారు. గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు డాక్టర్ వేగేశ్న చారిటబుల్ ట్రస్టు అధినేత రామకృష్ణంరాజు సూచన మేరకు దత్తత తీసుకున్నట్లు చెప్పారు. వైద్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సేవలకు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఉన్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీలో ప్రభుత్వ పరంగా సహాయం చేయడానికి వీలుకాని వ్యాధులకు వైద్య ఖర్చులను ఈ సంస్థ భరిస్తుంది. గ్రామాన్ని దత్తత తీసుకున్న సందర్భంగా గురువారం గ్రామంలో జరిగిన సభలో సంస్థ రాష్ట్రస్థాయి కన్వీనర్ నడింపల్లి వెంకటరామరాజు పాల్గొన్నారు. ఆత్రేయపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ ఫౌండేషన్ ఆత్రేయపురం కన్వీనర్‌గా గాదిరాజు ప్రసాదరాజును నియమించారు. ఫౌండేషన్ సభ్యులను ప్రతిపాదించారు. వేగేశ్న చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఉద్దరాజు విజయలక్ష్మి, మహర్షి విద్యానికేతన్ చైర్మన్ నడింపల్లి రామరాజు పాల్గొన్నారు.



'కాడెడ్ల బండి' ఇక.. 'షో'బొమ్మ!





పెళ్లిళ్లు, తీర్థాలకు వెళ్లాలంటే ఎడ్లబండ్లపైనే ప్రయాణం

పరుగులు తీయాలి.. గిత్తలు ఉరకలు వేయాలి.. వాగులు దాటి మన ఊరు చేరాలి.. అంటూ సాగుతుంది అలనాటి ఓ సినిమా పాట. పల్లె ప్రయాణ సాధనాలైన జోడెడ్లు, ఒంటెద్దు బండ్లకు ఉండే ప్రాముఖ్యతను అలనాటి సినీ గీతాలు వెల్లడిచేస్తాయి. బస్తీలో ఆదే సినిమాలకు వెళ్లాలన్నా, సమీప గ్రామాల్లో జరిగే జాతర్లకు, తీర్థాలకు వెళ్లాలన్నా ఆరోజుల్లో బండ్లు కట్టుకునే వెళ్లేవారు. బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి అంటూ నేటికీ ఉర్రూతలు ఊగిస్తున్న ఈ పాటలోని పదహారు బండ్ల మాటేమోగాని నేడు పల్లెల్లో ఒక్క ఎడ్లబండీ కానరావడం లేదు. పల్లె పేరు తలుచుకుంటే గుర్తుకు వచ్చే ఎడ్లబండ్లు కనుమరుగైపోతున్నాయి. ధాన్యం, సరుకుల రవాణాలో కీలకమైన ఎడ్ల బండ్లు ఇవాళ టెక్నాలజీ పేరుతో వచ్చిన యంత్రాల తాకిడికి కనుమరుగైపోయాయి. నాడు వైభవాన్ని చాటిన కాడెడ్లు నేడు ఇళ్ల ముందు అలంకారంగా, ఇళ్లలో టేబుళ్లుగా, షో బొమ్మల్లాగా దర్శనమిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి- రావులపాలెం)

ఒకప్పుడు పల్లెల్లో ఎడ్లబండ్లు అంతర్భాగంగా ఉండేది. ఇంచుమించుగా రెండెకరాలు పొలం ఉన్న ప్రతి రైతు ఇంట ఒక ఎండ్ల బండి ఉండేది. కానీ నేటి యాంత్రిక యుగంలో ఎడ్ల బండ్లు ఉనికిని కోల్పోయాయి. పల్లెల్లో ప్రయాణసాధనంగా ఉండే ఎడ్లబండ్లు వ్యవసాయ పనిముట్లు చేరవేయడం మొదలుకొని పండిన పంటను ఇంటికి చేరవేసే వరకు కీలకపాత్ర పోషించేవి. పెళ్లిళ్లు, పేరంటాలు, సినిమాలు, షికార్లు, తీర్థాలు, నాటకాలు, వనభోజనాలతోపాటు ఆఖరికి పొలాలకు కూలీలను తరలించడానికి సైతం ఎడ్లబండ్లను వినియోగించేవారు. బండెనకబండి పదుల సంఖ్యలో వరుసగా వెళ్తుంటే చూడటానికి రెండు కళ్లు సరిపోయేవికావు. ఎడ్లబండిపై ఊరు ఊరంతా తరలివెళ్లిన సంఘటనలు తీపిగుర్తులుగా మిగిలిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రహదారులు ఉండేవికావు. పుంతరోడ్లు, మట్టిరోడ్లు ఉండేవి. రహదారి సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండ్లనే వాడేవారు. మైళ్ల దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు పదుల సంఖ్యలో బండ్లలో వెళ్లేవారు. దీంతో దూరం నుంచి చూస్తే రైలు పెట్టెలా కనువిందు చేసేది. ఎడ్లబండ్లో కూర్చున్నవారు వర్షానికి తడవకుండా ఎండతగలకుండా గూడు కట్టేవారు. బండికి ముందుభాగంలో తొట్టె ఉండేది.. అందులో ఎండుగడ్డి, పచ్చిగడ్డి, దాణాలను ఎడ్ల మేత కోసం ఉంచేవారు. కొత్తగా పెళ్లైన్న కూతురిని అత్తవారు ఇంటికి పంపాలన్నా, పుట్టింటికి తీసుకురావాలన్నా ఎడ్లబండినే ఉపయోగించేవారు. ఆఖరికి గ్రామాల్లో ఎవ్వరికైనా జబ్బు చేస్తే ఎడ్లబండే ఎమర్జెన్సీ అంబులెన్స్ సర్వీస్.

సవారీ బండి... బెంజ్‌తో సమానం..

అప్పట్లో ధనవంతులు జమీందార్లు వాడిన సవారీ ఎడ్లబండి నేటి బెంజ్‌కారుతో సమానమని వృద్ధులు చెబుతున్నారు. సవారీ బండి సవారీ ఎడ్లతో గజ్జలమోతతో వేగంగా దూసుకెళ్లేది. అప్పట్లో వాహనాల శబ్దాలు లేకపోవడంతో గజ్జలమోత కిలోమీటర్ల మేర వినిపించేది. సవారీబండి టేకు కలపతో సుందరంగా తయారు చేయించేవారు. పలు డిజైన్లలో ఆకట్టుకునే విధంగా ఈ బండి అందంగా ఉండేది. పైన అందమైన గూడు, లోపల మెత్తటి పరుపు కూడా ఉండేది. అప్పట్లో ఈ సవారీ బండ్లపై పెళ్లికొడుకు, పెళ్లికూతురు వస్తే వారు ధనవంతులుగా భావించేవారు. అంటే సవారీబండి ఓ విలాసం.

ఎడ్లను బట్టి స్పీడ్.....

బండ్ల వేగం దానికి కట్టిన ఎడ్లను బట్టి ఉండేది. ప్రధానంగా ఒంగోలు, దేశవాళి, మైసూర్ ఎడ్లను కట్టేవారు. వీటిలో ఒంగోలు, దేశవాళి ఎడ్లు ధృడంగా ఉండి ఎంత బరువునైనా అలవోకగా మోసేవి. మైసూర్‌ఎడ్లు వేగంగా పరిగెత్తేవి. వీటికి మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం కొత్త కొత్తమోడల్ బైకుల గురించి ఎలా మాట్లాడుకుంటున్నామో ఆ రోజుల్లో ఎడ్లు, ఎడ్ల బండ్ల గురించి వాటి విశేషాలు ఆసక్తిగా చర్చించుకునేవారు. సంక్రాంతి పండుగ ఎడ్లపందాలకు మంచి క్రేజ్ ఉండేది. ఇప్పటికీ అక్కడక్కడ ఎడ్ల పందాలు పోటీలు జరుగుతూనే ఉన్నాయి.

సాగులోనూ కీలకమే...

సాగు ప్రారంభించిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చేవరకు రైతునేస్తంగా ఎడ్లబండ్లు ప్రముఖ పాత్రపోషించేవి. వరినాట్లు మొదలు ఎరు వులు, కూలీలను తీసుకెళ్లడం, పంటను ఇంటికి చేర్చడం వరకు కీలకపాత్ర పోషించేవి. కాలక్రమేణ అవి కనుమరుగైపోయాయి. యంత్రాలు, ఆధునిక పనిముట్లు రావడం, కష్టం తక్కువగా ఉండడం, పని తొందరగా అయిపోవడంతో రైతులు కూడా యాంత్రీకరణ వైపు మొగ్గుచూపారు. దీంతో ఎడ్లబండ్ల తయారీదారులు ఉపాధి కరువై వేరే వేరే వృత్తుల వైపు వెళ్లిపోయారు. ఎడ్ల బండి చేయాలంటే ఇప్పుడు చాలా కష్టసాధ్యం. చేసేవాళ్లు సైతం అరుదనే చెప్పాలి.







ఒంటెద్దు బండ్లు..

వ్యవసాయ పనులకు రెండెడ్ల బండ్లు కీలకమైతే ఆరోజుల్లో గోదావరి జిల్లాలో ప్రజల రవాణాకు గుర్రపు బండ్లు ఉపయోగపడేవి. వీటి కోసం గ్రామాలు, పట్టణాల కూడళ్లలో స్టాండ్లు కూడా ఉండేవి. ఇక నిత్యావసరాలు మొదలుకొని సరుకు రవాణాలో ఒంటెద్దు బండ్లు కీలకంగా ఉండేవి. ఒకే ఎద్దుతో ఈ బండ్లను లాగించేవారు. ఏదైనా కిరాణా దుకాణాలకుగాని, సంతలకుగాని సరుకు వెళ్లాలంటే ఒంటెద్దు బండ్లే ప్రధాన ఆధారంగా ఉండేవి.

షో... బొమ్మల్లా మారి..

కాడెడ్ల బండ్లు కనుమరుగవ్వడంతో వాటి జ్ఞాపకాల కోసం బజార్‌లో దొరికే కలపతో తయారుచేసిన ఎడ్లబండి బొమ్మలను ఇంట్లో పెట్టుకుంటున్నారు. చిన్న, పెద్ద సైజుల్లో ఎద్దులు, బండి అచ్చుగుద్దినట్టు ఎడ్లబండిలానే తయారుచేసిన బొమ్మలకు క్రేజ్ పెరిగింది. ఇలా కొందరు షోకేసుల్లో బొమ్మల్లా పెట్టి ఆనందిస్తుండగా, మరికొందరు టేబుళ్లగా చేయించుకుని వాడుతున్నారు. కాడెడ్ల బండ్లను ధరలు రూ.6,500 నుంచి రూ.25 వేల వరకు వాటి నాణ్యత, సైజు, మోడల్ బట్టి విక్రయిస్తున్నారు. అలాగే ఇళ్లలో వాడే సెంటర్ టేబుళ్ల రూపంలో తయారుచేసిన బండ్లను రూ.25 నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదిగాకుండా పూర్వం ఎడ్లబండ్లగా వాడిన పాత బండ్లను రంగువేసి అందంగా అలంకరించి ఇళ్ల ముందు కొందరు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా నగరాల్లో ఈ కల్చర్ బాగా పెరిగింది.



జగ్గన్నతోట ప్రభల తీర్థానికి గత ఏడాది ఎడ్ల బండ్లపై వస్తున్న జనం



పదండి పోదాం... ప్రభల తీర్థానికి..

450 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల తీర్థం చూసేందుకు అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా వంట సామగ్రితో ఎడ్లబండిపై వచ్చేవారు. ఈ జగ్గన్నతోట ప్రభల తీర్థంలో తిరిగి అక్కడే వండుకుని తిని తిరిగివెళ్లేవారట. అయితే ఈ సంప్రదాయం కొనసాగుతున్నా ఎడ్లబండ్లు మాత్రం తగ్గాయి. అయినప్పటికీ ఇప్పటికీ కొందరు ఎడ్ల బండ్లపైనే తీర్థానికి వస్తుండడం విశేషం. కొబ్బరాకులతో వేసిన గూడు బండ్లలో రావడం కన్నులపండువగా ఉంటోంది.







వ్యాధి నిర్ధారణలో కీలకంగా..

నేడు వరల్డ్ రేడియాలజీ డే



సాధారణ ఎక్స్‌రే

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యాధి నిర్ధారణలో కచ్చితత్వాన్ని తెలియజేసే విషయంలో రేడియాలజీ విభాగం పాత్ర కీలకం. 1895, నవంబరు 8న జర్మనీకి చెందిన విల్‌హెమ్ కాన్‌రాడ్ రాన్‌జెన్ అనే శాస్త్రవేత్త ఎక్స్‌రేను కనుగొన్నాడు. తద్వారా వ్యాధి నిర్ధారణకు అనేక పరికరాలు వచ్చాయి. అందువల్ల ప్రతిఏటా నవంబరు 8న ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న కాకినాడ జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగం అతి ముఖ్యమైనది రోగులు లేదా క్షతగాత్రులు లేదా గర్భిణులు ప్రతిరోజూ 3500 మంది నుంచి 4 వేలమంది వరకు వస్తూ ఉంటారు. వారిని మొదట వైద్యుడు పరీక్షించి రోగ నిర్ధారణ కోసం పలు ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారు. ఆ పరీక్షల నివేదిక ఆధారంగా వారికి వైద్యుడు ఇన్‌పేషెంట్‌గా గానీ, అవుట్‌పేషెంట్‌గాగానీ కచ్చితమైన చికిత్స అందించేందుకు వీలు కలుగుతుంది. అందువల్ల జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగ సేవలు కీలకంగా మారాయి. జీజీహెచ్‌లో ఐదు ఎక్స్‌రే ప్లాంట్‌లు, 12 మొబైల్ ఎక్స్‌రే ప్లాంట్‌లు, 5 అల్ట్రాసౌండ్ పరికరాలు, 2 కలర్‌డాప్లర్ పరికరాలు, ఒక సిటీ స్కాన్ యంత్రం, ఒక ఎంఆర్‌ఐ స్కాన్ యంత్రం అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాల ద్వారా ప్రతిరోజూ 800 మందికి రోగనిర్ధారణ చేయగలుగుతున్నారు. ఎంఆర్‌ఐ స్కాన్‌లో బ్రెయిన్, స్పైన్‌లో అసాధారణమైన నిర్ధారణను కచ్చితత్వంగా తెలియజేస్తుంది.

అన్ని పరీక్షలు అందుబాటులో..

కాకినాడ జీజీహెచ్‌లో అన్ని రకాల ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ రేడియాలజీ దినంలో భాగంగా ఈ ఏడాది 'కనిపించని దాన్ని చూడగలగడం' అనే నినాదంతో ఈ డేను నిర్వహించదలిచాం. రేడియాలజీ విభాగానికి చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. మానవ అవయవాల్లో ఎంత చిన్న డిసీజ్ ఉన్నా పసిగట్టగలిగేవి రేడియాలజీ సేవలే. ముఖ్యంగా సున్నితమైన గర్భిణికి ఎటువంటి ఎక్స్‌రే కిరణాలు ఎఫెక్ట్ అవ్వకుండా అల్ట్రా సౌండ్ పరికరంతో పరీక్ష చేసి కచ్చితమైన నిర్ధారణ చేయవచ్చు. మెరుగైన సేవలందించేందుకు మరిన్ని అడ్వాన్స్‌డ్ అల్ట్రా సౌండ్ పరికరాలు అవసరం. ఇప్పటికే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి ద్వారా కలెక్టర్‌కు పరికరాల అవసరత గురించి విన్నవించాం. జీజీహెచ్‌లో ఎక్స్‌రే మిషన్‌లు, ఫ్లోరోస్కోప్ మిషన్లు, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ యంత్రం తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. పేదలు రేడియాలజీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. **- డాక్టర్ అనురాధ, రేడియాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్**





46 సంవత్సరాల క్రితం తాము చదువుకున్న తరగతి గదిలో అప్పటి విద్యార్థినులుగా పూర్వ విద్యార్థినులు

60 ఏళ్లొచ్చినా.. అదే అల్లరి!

● అనపర్తిలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

అనపర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దలు పిల్లలైపోయారు..ఆనందంతో గంతు లేశారు.. ఆడారు.. పాడారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.. ఇదేదో 30..40 ఏళ్ల పూర్వ విద్యార్థినులు కాదండోయ్.. సుమారుగా 60 ఏళ్లవాళ్లంతా కలుసుకున్నారు. తమ తరగతిలో కూర్చుని ఆ నాటి తీపిజ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.. ఈ మధుర జ్ఞాపకాలకు అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల గురువారం వేదికగా మారింది. 1977-78లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినులు పాఠశాలలో గురువారం కలుసుకున్నారు. ఏమేవ్ ఏంచేస్తున్నాం.. గుర్తున్నాయా ఆ రోజులు.. నువ్వు ఢిల్లీ వెళ్లి కప్ తెచ్చావా మరచిపోయావా.. ఇదిగో నీ కప్పు అంటూ ఆనాటి 46ఏళ్ల తరువాత ఆ కప్ అందించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు.



తమ స్నేహితులను సెల్‌ఫోన్‌లో చిత్రిస్తూ స్నేహితురాలు బిజీ బిజీ

కాసేపు తమ తరగతి గదిలో కూర్చుని ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుని.. ఒకరికొకరు ఫొటోలు తీసుకుని మళ్లీ కలుద్దాం.. సెలవంటూ భారంగా సాయంత్రం ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. పాఠశాలకు ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. కొవ్వూరి సరస్వతి కృషితో జరిగిన ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు సుబ్బలక్ష్మి, సత్యవతి నిర్మల, సుజాత, జయశ్రీ హాజరయ్యారు.



చదువుకునే రోజుల్లో గర్ల్స్ నుంచి ఢిల్లీ స్థాయికి వెళ్లి క్రీడా పోటీల్లో పాల్గొన్న స్నేహితురాళ్ల సంతోషాలు

11 నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు

● కల్యాణ సంతాన గోపాలుడిగా ప్రసిద్ధి

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 11వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణ, సంతాన గోపాలుడిగా ప్రసిద్ధిగాంచిన ఈ స్వామి ఉత్సవాలు 18వ తేది వరకూ జరుగుతాయి. 11వ తేదిన ఉదయం విశ్వక్సేన పూజ, స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహిస్తారు. 12వ తేదిన స్వామి, అమ్మవార్లకు అర్చనలు, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి సేవా సమితి మహిళా భక్త సమాజంచే కల్యాణ అలంకారం, గజవాహనంపై గ్రామోత్సవం, సాయంత్రం 6గంటలకు ధ్వజారోహణం, రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతాయి. 13వ తేదిన స్వామి, అమ్మవార్లకు అర్చనలు, శేషవాహనంపై గ్రామోత్సవం, 14వ తేది సాయంత్రం సదస్యం, పండిత సభ, రాత్రి స్వామి రథోత్సవం, 15వ తేదిన ఆలయం వద్ద చక్రస్నానం, గరుడ వాహనంపై గ్రామోత్సవం, 16వ తేదిన స్వామికి శ్రీపుష్పయాగం, 17,18వ తేదిల్లో 2,3వ రోజు పుష్పయాగాలు నిర్వహిస్తారు. యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో నున్న శ్రీరాములు, అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్‌లు కోరారు. కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు.





పిఠాపురంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

టీటీడీ సభ్యుడిగా
మునికోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం


రాజమహేంద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితుడైన అక్కిన ముని కోటేశ్వరరావు గురువారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్, కొంతమంది సభ్యులు బుధవారమే ప్రమాణ స్వీకారం చేయగా, గురువారం కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. తాను ఊహించని విధంగా తనకు స్వామికి సేవ చేసే అవకాశం వచ్చిందని, మంచిగా సేవ చేస్తానని ఆయన తెలిపారు.



మునికోటేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహా పర్వదినాలు ఆరవవరోజు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజలలో భక్తులు పాల్గొన్నారు.



జ్యోతిర్లింగార్చన దృశ్యం



అయోధ్యనగర సీతారామ ఫౌండేషన్ ట్రస్టుకు అందజేసిన సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు

అయోధ్య రాములోరికి
పంచలోహ విగ్రహాలు

● అందజేసిన మండపేటవాసి శ్రీనివాసరావు

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం మారేడుబాకకు చెందిన వాసా శ్రీనివాసరావు దేవాలయ విగ్రహాలు తయారు చేసే శిల్పి అయోధ్య బాలరాముడు 25 కిలోల పంచలోహ విగ్రహంను గురువారం అయోధ్యకు పంపించారు. 16అంగుళాల ఎత్తు 20కిలోల పంచలోహలతో విగ్రహంను తయారుచేశారు. అయోధ్య నగర సీతారామా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రి అయోధ్యరాముడికి బాలరాముడిని పంపించామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే అయోధ్యలో చల్లా శ్రీనివాసశాస్త్రి గత ఆరేళ్లనుంచి నిర్వహిస్తున్న ట్రస్టుకు సంబంధించి అయోధ్య రాముడు సూర్యవంశంకు చెందిన ఆలయంను నిర్మిస్తున్నారు. వాసా శ్రీనివాసరావు దంపతులు శ్రీసీతారామచంద్ర లక్షణ, హనుమాన్, 90 కిలోలతో తయారుచేసిన పంచలోహ విగ్రహాలు అందజేశారు. అయోధ్యకు ఉత్సవ మూర్తుల విగ్రహల అందజేసిన కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు వి.సాయికుమార్‌బాబు, వేగుళ్ల అజయ్‌బాబు విగ్రహాలను ట్రస్టీకి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరాజు, ఎంపీఎస్ చిన్నారావు, వాసారవికిరణ్, శిరంగు ఈశ్వరరావు, బండి గోవిందు పాల్గొన్నారు.



బాలరాముడు విగ్రహాన్ని ట్రస్టుసభ్యులకు అందజేస్తున్న అజయ్‌బాబు


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి
రూ.2 లక్షలు విరాళం

ఆత్రేయపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి గూడపాటి రాంబాబు-నవ్య, గూడపాటి త్రివేది-దుర్గారాణి దంపతులు గురువారం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,09,207 లభించినట్లు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి శ్రీనివాసరావు

రేపు 'నన్నయ'లో జాతీయ శతాధిక కవి సమ్మేళనం

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు తెలిపారు. గురువారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నన్నయ వర్శిటీ తెలుగు శాఖ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మేళనానికి ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిశాల నుంచి 150 మంది కవులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ, అధ్యాపకులు తలారి వాసు, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకుడు పీవీవీ సంజీవరావు పాల్గొన్నారు.



ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు, బ్యాగ్

మధురపూడి విమానాశ్రయంలో
కలకలం

ఆరు బుల్లెట్లతో ప్రయాణికుడు అరెస్టు
కేసు నమోదు
కొనసాగుతున్న దర్యాప్తు

కోరుకొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయంలో బుధవారం రాత్రి ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు తీవ్ర కలకలం రేపాయి. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయానికి బుధవారం రాత్రి విజయవాడకు చెందిన ఎం.సుబ్బరాజు హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చాడు. ఆయన తన లగేజ్‌తో టెర్మినల్ భవనంలోకి వెళ్లే సమయంలో ఆయన వద్ద బుల్లెట్లు ఉన్నట్లు స్కానింగ్‌లో వెల్లడైంది. వెంటనే అప్రమత్తమైన ఎస్‌పీఎఫ్ సిబ్బంది ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని బుధవారం అర్ధరాత్రి కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే తనకు లైసెన్స్ గన్ ఉందని, తుపాకీ లోడ్ చేస్తున్న సమయంలో కొన్ని బుల్లెట్లు తన వద్ద ఉండిపోయాయని వాటిని చిన్న బ్యాగ్‌లో ఉంచి మర్చిపోయానని సుబ్బరాజు పోలీసులకు తెలిపాడు. బుల్లెట్లను, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయ నిబంధనల ప్రకారం బుల్లెట్లతో ప్రయాణించడం, దానికి తగిన అనుమతులు తీసుకోకపోవడంతో ఆయనపై గురువారం ఉదయం కేసు నమోదు చేసినట్లు కోరుకొండ ఎస్ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని సుబ్బరాజుకు స్టేషన్ బెయిల్ ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దర్యాప్తులోని అంశాలను అనుసరించి తదుపరి చర్యలు ఉంటాయన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జ్యోతిప్రకాశనంతో సదస్సును ప్రారంభిస్తున్న శాంతిశ్రీ ధూళిపూడి పండిట్, ఆచార్య శ్రీనివాసరావు, డాక్టర్ రామారెడ్డి

తెలుగు వైభవాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేయాలి

ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు వైభవాన్ని భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలకు తెలియజేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, కళాశాల ఆంగ్ల విభాగం, విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగే సాంస్కృతిక వైభవం-సదస్సును గురువారం అతిథులు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ దేశంలో భాషాభిమానం ఎక్కువగా ఉన్న వారిలో తమిళనాడు మొదటి స్థానంలో ఉన్నారు. తెలుగు వారు అటువంటి భాషాభిమానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. నిద్రాణమైన జాతిని జాగృతం చేయడం కోసం గత వైభవస్మరణం ఎంతో అవసరమన్నారు. కందుకూరి, గురజాడ వంటి మహనీయులు మన సంస్కృతిలో భాగమన్నారు. అటువంటిమహనీయులను స్మరించుకుంటూ భావితరాలకు మన సంస్కృతిని అందించాలని సూచించారు. భాష, సంస్కృతి, కథన శక్తిని అందరూ పెంపొందించుకోవాలని కోరారు. నన్నయ ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు మాట్లాడుతూ మన ప్రాంతంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడానికి ఈ సదస్సు చక్కని వేదిక అవుతుందన్నారు. 'జ్ఞానమంటే డిగ్రీ కాదోయ్... జ్ఞానమంటే ప్రపంచానికి ఉపయోగపడే యువశక్తిని తెలియజేయడమే' అన్న గురజాడ మాటలను ఆయన గుర్తు చేశారు. కాప్స్ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో ఉపాధి అవకాశాల నేపథ్యంలో సామాజిక అంశాలను విస్మరిస్తున్నారన్నారు. సదస్సులో నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి, కాప్స్ ఉపాధ్యక్షుడు ఆచార్య జి.నాగేశ్వరరావు, అటవీ శాఖ విశ్రాంత అధికారి నళినీమోహన్, సదస్సు కన్వీనర్లు ఆచార్య కె.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి మాట్లాడారు. మధ్యాహ్నం జరిగిన సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు పరిశోధనా పత్రాలను సమర్పించారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీనటరాజ నిలయ చర్మచిత్ర కళాకారుల తోలు బొమ్మలాట ఆకట్టుకున్నాయి.


క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కాకినాడ జిల్లా డీఈవో రమేష్

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ అన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడా మండలి మైదానంలో అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. 68వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, వ్యాయామ విద్యా రాష్ట్ర పర్యవేక్షణాధికారి భానుమూర్తి రాజు, డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, ఏడీ నాగేశ్వరరావు, తలాటం హరీష్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి నూకరాజు, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ షర్మిల పాల్గొన్నారు.


క్రీడాకారుల విన్యాసాలు



జీఎస్ఎల్ వైద్య కళాశాలలో
సిమ్యులేషన్ వర్క్‌షాప్


సిమ్యులేషన్ ల్యాబ్‌లో విద్యార్థులకు వైద్య పద్ధతులను వివరిస్తున్న వైద్యులు

రాజానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌కేర్ సిమ్యులేషన్ సొసైటీ (ఎస్‌హెచ్‌ఎస్) నిర్వహిస్తున్న 6వ వార్షిక హెల్త్‌కేర్ సిమ్యులేషన్ కాన్ఫరెన్స్, సిమ్యుల్కాన్-2024 వేడుకలు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. సదస్సు సమన్వయకర్త డాక్టర్ గన్ని సందీప్ విలేకరులతో మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లు హెల్త్‌కేర్ విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు రూపొందించామన్నారు. ఆరోగ్య విద్యలో ప్రాక్టికల్ స్కిల్స్‌ని మెరుగుపర్చడం, సిమ్యులేషన్‌లో కొత్త ప్రయోగాలను అందించడం మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు లక్ష్యమని చెప్పారు. మొదటి రోజు వర్క్‌షాపుల్లో దేశవ్యాప్తంగా 200 మంది డెలిగేట్లు పాల్గొన్నారు. మిగిలిన రెండు రోజుల కాన్ఫరెన్స్‌లకు మరో 600 మంది హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వీఎస్ మహాలక్ష్మి, దినకర్, లూలు షరీఫ్, ఈ.రాజ్‌కుమార్, మోహన్ మహారాజ్, జేజే డేవిడ్, అచ్యుత్, గోంగడ, ఎల్లపు రామునాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

రూ2 లక్షల మేర ఆస్తి నష్టం


పూర్తిగా కాలిపోయిన తాటాకిల్లు

ఎటపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీ గొందిరాజుపేట (కారం వారిగుంపు)లో కారం రవి ఇంటికి గురువారం సాయంత్రం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. ఆ సమయంలో రవి ఆరేళ్ల కుమార్తె అన్విత ఇంట్లో ఉంది. ఇంటిని మంటలు చుట్టుముడుతుండగా చిన్నారి గమనించి పరుగున బయటకు వచ్చి ఇరుగు పొరుగు వారికి చెప్పింది. కొద్దిసేపటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. మంటల ధాటికి గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. రూ.21వేల నగదుతో పాటు బంగారు ఉంగరం, చెవికమ్మలు, బీరువా, టీవీ, గృహోపకరణాలు, సర్టిఫికెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు చెప్పాడు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నష్టాన్ని అంచనా వేశారు.

2,21,536

పట్టభద్రుల ఓటు హక్కుకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు
ఈనెల 23న ముసాయిదా జాబితా
వచ్చే నెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం
వచ్చే నెల 30న తుది జాబితా విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదుకు భారీఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 6వ తేదీ వరకు నమోదు చేసుకున్న వారి పేర్లను ఈ నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ప్రచురించనున్నారు. ఈ నెల 7 నుంచి 23వ తేదీ వరకు ఒక దఫా, ఈనెల 24 నుంచి డిసెంబరు 9వరకు కూడా మరో దఫా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. వీరందరి పేర్లు వచ్చేనెల 30న తుది జాబితాలో ప్రచురిస్తారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటు హక్కుకు 2,21,556 మంది నమోదు చేసుకున్నట్టు సమాచారం. అల్లూరి సీతారామరాజు జిల్లా 3,082, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 46,207, తూర్పు గోదావరి జిల్లా 42,210, ఏలూరు జిల్లా 35500, కాకినాడ జిల్లా 41754, పశ్చిమ గోదావరి జిల్లా 52893 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఓటు నమోదు అధికారి పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అప్పటివరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మళ్లీ మరో దఫా వచ్చేనెల 9 వరకు దరఖాస్తుల స్వీకరించారు. అనంతరం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు డిసెంబరు 30న ప్రచురించే తుది జాబితాలో ఉంటాయి. ఓటు నమోదుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే ఓటు నమోదు చేస్తారు. దరఖాస్తులను ఏఈఆర్వోలుగా ఉన్న తహసీల్దార్లు ధ్రువీకరిస్తే సరిపోతుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి శుక్రవారం సాయంత్రం వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని ఓటు నమోదు అధికారి, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉంటే నమోదు చేసుకోచ్చన్నారు.


సామర్లకోటలో ఎంప్లాయిస్ సంఘ్ నేతల ప్రచారం

రైల్వేలో గుర్తింపు సంఘం
ఎన్నికల సందడి

డిసెంబరు 4,5,6 తేదీల్లో పోలింగ్
పోటాపోటీగా హామీలిస్తున్న ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి నెలకొంది. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరిగే పోలింగ్‌లో కడియం నుంచి తుని (హంసవరం) వరకు విస్తరించి ఉన్న సామర్లకోట రైల్వే సెక్షన్‌లో సుమారు 800 మంది సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే సామర్లకోట నుంచి కడియం వరకు సంఘ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించగా గురువారం సామర్లకోట నుంచి హంసవరం వరకు ప్రచారం పూర్తి చేశారు. సామర్లకోట జంక్షన్ ప్రధాన కేంద్రంగా రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌లు కొన్ని రోజులుగా పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. దశాబ్దం తర్వాత మరలా జరుగుతుండడంతో హామీలను గుప్పిస్తూ ఇరు సంఘాలు పోటాపోటీగా ఉన్నాయి.

గుర్తింపు సంఘ ఎన్నికల్లో తొలి నుంచీ సత్తా చాటుతూ వచ్చిన మజ్దూర్ యూనియన్‌పై 2013లో మాత్రం ఎంప్లాయిస్ సంఘ్ గెలిచి సంచలనం సృష్టించింది. తమ పట్టుని మరోసారి నిలుపుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్, పూర్వవైభవం సొంతం చేసుకోవాలని మజ్దూర్ యూనియన్ పరస్పరం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఆయా సంఘాల జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానించి మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులను వ్యక్తిగతంగా కలుసుకుంటూ మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు.

ఏకీకృత పెన్షన్ విధానం అమలుకు ఒత్తిడి తెస్తాం

ఎం.రమేష్, ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి, సామర్లకోట

రైల్వేలో నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విదానం (యూపీఎస్) అమలుకు పోరాటం చేస్తాం. 8వ పే కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయించి డాక్టర్ అక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ.32,500 ఇప్పించాలి. 2020 జనవరి నుంచి 2021 వరకు నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, డీఆర్ తక్షణం విడుదల చేయించేందుకు పోరాటం కొనసాగిస్తాం. పీఎల్ బోనస్‌పై ఉన్న శాలరీ సీలింగ్‌ను తొలగించాలి. 12 గంటల డ్యూటీని రద్దు చేసి 8 గంటల విధానాన్ని ప్రవేశపెట్టిస్తాం. రైల్వేలో పాయింట్స్‌మెన్ కేటగిరీ-4 గ్రేడ్ పే స్ట్రక్చర్ అమలుకు రైల్వే బోర్డుతో చర్చిస్తాం. రైల్వే ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య చికిత్స ట్రావెలింగ్ పాస్ సదుపాయాల కల్పనకు ప్రయత్నం చేస్తాం. ట్రాక్ మెయిన్‌టెనర్ల పనిగంటలు తగ్గించి భోజన విరామాన్ని డ్యూటీలో భాగంగా పరిగణించాలి. ఎస్‌ఎఫ్ఐఆర్ డిమాండ్ నెంబరు 1, 2022 ప్రకారం ఎల్‌డీసీఈని అందరికీ వర్తింపచేయాలి. కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న మహిళా ఉద్యోగులు వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధనతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలి.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు
భావన ఎంపిక



అంతర్వేది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మోరిలోని జాన సుబ్బమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చెల్లుబోయిన భావన అండర్-14 బాలికల హైజంప్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. డిసెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని హెచ్‌ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్, దివ్యలను సర్పంచ్ లక్ష్మీపద్మమంగతాయారు భగవాన్, అలివేలుగంగాత్రివేణి నాని, జాన శంకరరావు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలిక అదృశ్యం కేసుపై డీఎస్పీ విచారణ


బాలిక తల్లిదండ్రులను విచారిస్తున్న డీఎస్పీ

ప్రత్తిపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతూ అదృశ్యమైన బాలిక నెల్లి వరలక్ష్మి ఆచూకీ తెలుసుకునేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బాలిక స్వగ్రామం గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి గురువారం సాయంత్రం ఆయన వెళ్లి తల్లిదండ్రులు నూకరత్నం, రామకృష్ణలతో మాట్లాడారు. బాలిక అదృశ్యం కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. వీలైనంత త్వరలోనే బాలిక ఆచూకీ తెలుసుకుని అప్పగిస్తామని డీఎస్పీ భరోసా ఇచ్చారు. ఆయన వెంట సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం ఉన్నారు.

ప్రేమ పేరుతో మోసం యువకుడిపై పోక్సో కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు చెందిన 16 ఏళ్ల బాలిక 8వ తరగతి వరకు చదువుకుంది. వేసవి సెలవులకు కడియపులంకలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆపై ఆమె గర్భం దాల్చింది. ఆ విషయం యువకుడికి తెలియజేయడంతో గర్భస్రావం కోసం మాత్రలు తెచ్చి ఇవ్వడగా ఈ నెల రెండో తేదీన గర్భస్రావమైంది. విషయం తెలుసుకున్న పెద్దలు బాలికను పెళ్లి చేసుకోమని కోరగా నిరాకరించడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు
వడిశలేరు వాసి అరెస్టు

గోపాలపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దేవరపల్లి సీఐ నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన వీరబత్తుల చంద్రశేఖర్ ఎన్నికల ముందు, ఆ తర్వాత చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్య పదజాలంతో పార్టీల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. దీంతో అతడిపై గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని అరెస్టు చేశారు.

జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా విశాఖ-విజయవాడ-విశాఖ మధ్య ఇటీవల ప్రవేశ పెట్టిన జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు రద్దు చేస్తూ రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు గురువారం రాత్రి అందాయి. 08567 విశాఖ-విజయవాడ మధ్య, 08568 విజయవాడ-విశాఖ మధ్య నడిచే జన సాధారణ్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 8, 10, 11, 13 తేదీల్లో రద్దు చేశారు. విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఇంటర్‌లాకింగ్, సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణ పనులు చేపడు తున్న దృష్ట్యా ఈ రైళ్లను రద్దు చేసినట్టు విశాఖ రైల్వే పీఆర్వో అధికారి తెలిపారు.

శబరిమలకు పాదయాత్ర

అమలాపురంరూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు కొప్పాడి రాంబాబు రెండో ప ర్యాయం పాదయాత్ర చేపట్టారు. నటరాజ్ గురుస్వామి ఆశీస్సులతో ఈదరపల్లిలోని కోనసీమమహాశాస్త అయ్యప్పస్వామి గురుపీఠంనుంచి బుధవారం ఆయన పాదయాత్రను ప్రారంభించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

అంబాజీపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇసుకపూడికి చెందిన తెన్నేటి మరియమ్మకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108లో ఆసుపత్రికి తీసుకువెళ్తున్నారు. మార్గమధ్యలోనే ఆమె బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ శివప్రసాద్, పైలెట్ రావులు తల్లి, బిడ్డను పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన





డొక్కా సీతమ్మ అక్విడెక్టు పి.గన్నవరం వైపు ముసుగులు లేని విగ్రహాలు, మామిడికుదురులో ముసుగులు వేయని నాయకుల విగ్రహాలు

● పి.గన్నవరం, మామిడికుదురు మండలాల్లో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయని వైనం

పి.గన్నవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో ఈనెల4వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఇప్పటికే ఉన్నతాధికారులు ప్రకటన చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ డిసెంబర్ 5న జరుగుతుందని, 9న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారని అధికారులు తెలిపారు. డిసెంబరు 12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. ఈనేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ప్రధాన సెంటర్లో గల రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు ఫ్లెక్సీలను తొలగించాలని మండలస్థాయి అధికారులు గ్రామస్థాయి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టుకు లంకలగన్నవరం వైపు ఉన్న మాజీ ఎమ్మెల్సీ బోళ్ల వెంకటసత్యనారాయణ విగ్రహానికి ముసుగులు వేశారు. పి.గన్నవరం వైపు పదుల సంఖ్యలో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు మాత్రం పంచాయతీ అధికారులు ముసుగులు వేయలేదు. దీంతో పి.గన్నవరం ప్రధాన సెంటర్‌లోనే ఎన్నికల కోడ్‌ను అమలు చేయకపోతే ఇక గ్రామాల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అమలు కాని ఎన్నికల కోడ్

మామిడికుదురు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ప్రకటించిన ఎన్నికల కోడ్ మండలంలో అమలు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎన్నికల కోడ్‌ను 4వ తేదీ నుంచి ప్రకటించినప్పటికీ అధికారుల్లో స్పందన లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ఎక్కడా ముసుగులు వేసిన దాఖలాలు కనిపించకపోవడం గమనార్హం. అధికారులు ఎన్నికల కోడ్ ప్రకటించినప్పటికీ అది అమలు కాకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రధాన రహదారిలో కూడా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయకపోవడంపై ప్రశ్నిస్తున్నారు.

ప్రతీ ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి



యోగా గురువు కేతన్ ఆకులను సన్మానిస్తున్న యోగ సాధకులు

మామిడికుదురు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని యోగా గురువు కేతన్ ఆకుల, రాజోలు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు యేడిద కవీంద్ర పేర్కొన్నారు. మామిడికుదురులోని కేతన్ యోగా సెంటర్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల బీపీ, షుగర్, థైరాయిడ్, సైనస్ వంటివి దూరమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో యోగాను వ్యాపింప చేస్తున్న యోగా గురువును యోగ సాధకులు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కోట బ్రహ్మానందం, మెండా ఆదినారాయణ, గుండాబత్తుల సత్తిరాజు, బత్తుల శ్రీదేవి శ్రీనివాస్, నయినాల వాణిరామకృష్ణ, నానాజీ, దొరబాబు, నయినాల రఘురామయ్య, జి.ప్రసాద్, లీలా, సుస్మిత, భవానీ, రాజేష్, యోగ సాధకులు పాల్గొన్నారు.

ఘనంగా 74వ స్కౌట్ ఫ్లాగ్‌డే

యానాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యానాం జవహర్ నవోదయవిద్యాలయంలో 74వ స్కౌట్ ఫ్లాగ్‌డే వేడుకలను నిర్వహించారు. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.సాంబశివరావు స్కౌట్ జెండాలను ఎగురవేసి విద్యార్థులతో స్కౌట్ వందనాన్ని స్వీకరించారు. స్కౌట్ ఉద్యమ పితామహుడు లార్డ్ బేడెన్‌పౌల్ చిత్రపటానికి పూలమాలలువేశారు. స్కౌట్ విద్యార్థులు శివాజీ, అంజేయుడు, యశ్వంత్‌కృష్ణాలు స్కౌట్ ఉద్యమం, ఫ్లాగ్‌డే విశేషతను వివరించారు. ఇద్దరు విద్యార్థులు ఈనెలలో గోవాలో జరిగే ఎడ్వంచర్ కార్యక్ర మానికి వెళుతున్నట్లు స్కౌట్ మాస్టర్ పాపారావు తెలిపారు.



అధ్యాపకులతో యాజమాన్యం సంప్రదింపులు

అధ్యాపకునితో మాట్లాడుతున్న ఆర్డీవో కె.మాధవి

మలికిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మలికిపురం డిగ్రీ కళాశాలలో 57రోజులుగా అధ్యాపకులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో సమ్మె కాలానికి ముందు వరకు యాజమాన్యం జీతాలు చెల్లించి సమ్మెచేస్తున్న 24మందిని తొలగిస్తూ నోటీసులు అందజేశారు. జీతాలు చెల్లించారు కాబట్టి విధుల్లో చేరతామని అధ్యాపకులు కోరినా యాజమాన్యం స్పందించలేదు. దీంతో అధ్యాపకులు నిరసన దీక్షను కొనసాగిస్తున్నారు. ఇరు వర్గాలమధ్య సయోధ్య కుదర్చడానికి అమలాపురం ఆర్డీవో కె.మాధవి గురువారం సాయంత్రం కళాశాల వద్దకు వచ్చారు. ముందుగా కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తితో చర్చించారు. కళాశాలలో పరిస్థితులను ఆయన ఆర్డీవోకు తెలియచేశారు. అనంతరం ఆర్డీవో డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో నిరసన చేస్తున్న 24మంది అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ మీకు జీతాలు చెల్లించలేమని కరస్పాండెంట్ చెబుతున్నారు కాబట్టివిధుల్లో చేరినా రెండు నెలలకు మరలా ఇదేపరిస్థితి ఏర్పడుతుంది కదా అని అడిగారు. అధ్యాపకుల తరపున రాహేల్‌బాబు మాట్లాడుతూ మిగతా సిబ్బందికి ఎప్పుడు చెల్లిస్తే తమకు కూడా అప్పుడే చెల్లించమని అడిగారు. సమ్మె కాలాన్ని పరిగణలోకి తీసుకోవాలని, సమ్మెకు ముందు తామంతా ఏవిధంగా విధుల్లో కొనసాగామో అదేవిధంగా కొనసాగించాలని యాజమాన్యంఏవిధమైన వేధింపులు చేయకూడదని కోరారు. వీరి సమాచారాన్ని కరస్పాండెంట్ వద్దకు తీసుకువెళ్లారు. కోర్టులో ఉన్న వ్యవహారం తేలిన తర్వాత చెబుతానని కరస్పాండెంట్ తెలియచేయడంతో మరోసారి చర్చిస్తామని ఆర్డీవో చెప్పారు. తహశీల్దార్ టి.శ్రీనివాస్, ఎస్‌ఐ పి.సురేష్, ఎంఈవో విజయశ్రీ ఉన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల స్క్రీనింగ్ శిబిరానికి 406మంది హాజరు



ఈదరపల్లిలో హాజరైన దివ్యాంగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో బాబ్జిరాజు

అమలాపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందజేసేందుకు ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన స్క్రీనింగ్ వైద్య పరీక్షల శిబిరానికి నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 10గంటలకే వందలాది మందితో ప్రాంగణం కిటకిటలాడింది. ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం మండలాలు, అమలాపురం పట్టణానికి చెందిన దివ్యాంగులు హాజరయ్యారు. దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మండలాల వారీగా స్క్రీనింగ్ శిబిరాలను ఏర్పాటుచేశారు. ఎప్పటికప్పుడు అమలాపురం, అల్లవరం ఎంపీడీవోలు ఉండ్రు బాబ్జిరాజు, కృష్ణమోహన్‌లు వారికి సూచనలు చేశారు. శిబిరానికి దివ్యాంగులతో పాటు హాజరైన సహాయకులు 700మందికి భోజన సదుపాయం కల్పించారు. 406మందికి వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కోదూరి వెంకటేశ్వరరావు, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, ధనలక్ష్మి, శింగంపల్లి దుర్గాశ్రీనివాస్, డి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు. సందట్లో సడేమియా అన్నట్టుగా కమ్యూనిటీ హాలు వద్ద ఒక వీల్‌చైర్‌ను ఆటో డ్రైవర్ ఆటోలో వేసుకుని ఉడాయించాడు. ఈఘటనపై విచారణ జరుపుతున్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

అమలాపురంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాచవరంలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ ఆదేశాలపై ఎస్‌ఐ బాలాజీ బృందంతో గురువారం దాడి చేశారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న గుబ్బల సత్యనారాయణను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు ఎన్డీపీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు.

హిందీ ప్రచార సభ పరీక్షల్లో ప్రతిభ

అమలాపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షా ఫలితాల్లో కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రాథమిక పరీక్షలో 42మంది ప్రథమ, ఇద్దరికి ద్వితీయస్థానాలు లభించాయి. మధ్యమ పరీక్షలో 16మంది ప్రథమ స్థానాలు సాధించారు. రాష్ట్ర భాషా పరీక్షలో 31మంది, ప్రవేశిక పరీక్షలో 14మంది ప్రథమ స్థానాలు సాధించారు. విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, హిందీ ఉపాధ్యాయులు ధాత్రిరత్న, ఫాతిమా, రాణిసుజాత, సునీత, విజయలక్ష్మి, సత్యదుర్గలు అభినందించారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

ఐ.పోలవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరానికి చెందిన జగతా శ్రీను మురమళ్ళ వీరేశ్వరస్వామి గోకులానికి రూ.20వేల విలువైన పశుగ్రాసాన్ని అందించారు. గురువారం ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజుకు పశుగ్రాసం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించారు.

పెరుగులంక భూమిపై లంక గ్రామాల మధ్య వివాదం

సర్వే నిర్వహించిన అధికారులు





పెరుగులంక భూమిని సర్వే చేస్తున్న అధికారులు, రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ముమ్మిడివరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెరుగులంక భూమి విషయంలో రెండు మండలాలకు చెందిన లంక గ్రామాలకు మధ్య వివాదం చోటు చేసుకుంది. పెరుగు లంక భూమి తమదంటే తమదని ఆయా లంక గ్రామాల రైతులు పేర్కొనడంతో వివాదం తలెత్తింది. దీంతో కమిని, లంకాఫ్ ఠాణేలంక పంచాయతీ పరిధిలోని కొందరు రైతులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంక, వలసలతిప్ప, లంకాఫ్‌ఠాణేలంక, పంచాయతీ పరిధిలోని కూనాలంక, కె.గంగవరం మండలం శేరిలంక గ్రామాల మధ్య సుమారు 105ఎకరాల లంక భూమి మేట వేసింది. అయితే ఈభూమిని శేరిలంక గ్రామాల వారు సేద్యం చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. అయితే గతంలో ఆ భూమిని ఆనుకుని సొసైటీల పేరిట డి-ఫారం పట్టాలు ఇచ్చారని అయితే కాలక్రమేణా వరదలకు ఆ భూమి నదీపాతమైందని, ఇటీవల 105ఎకరాల భూమి అక్కడ మేట వేసిందని అయితే ఆ భూమి తమ గ్రామాల పరిధిలోకి వస్తుందని ముమ్మిడివరం మండలంలోని కమిని రెవెన్యూ విలేజ్ పరిధిలోని రైతులు పేర్కొంటున్నారు. శేరిలంక రైతులు ఆ భూమి తమదేనని వారు పేర్కొంటున్నారు. దీంతో ఈవిషయం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఆర్డీవో, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈసరిహద్దు భూమి వివాదాన్ని పరిష్కరించేందుకు గురువారం పెరుగులంక భూమిని అధికారులు సర్వే నిర్వహించారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ముమ్మిడివరం, కె.గంగవరం ఎస్‌ఐలు డి.జ్వాలాసాగర్, జానీబాషా, 15మంది సీఆర్‌ఎఫ్ సిబ్బంది బందోబస్తు నడుమ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ యామినీసుధా, రామచంద్రపురం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎన్.శ్రీనివాస్, కె.గంగవరం, ముమ్మిడివరం సర్వేయర్లు పావని, ప్రసాద్,ముమ్మిడివరం తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మిలు సర్వే నిర్వహించారు. పాత రికార్డులు, సరిహద్దులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని, అప్పటివరకు వివాదాలకు వెళ్లవద్దని, ఒకవేళ వివాదాలకు వెళ్లితే చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులను హెచ్చరించారు. దీనిపై తహశీల్దార్ ఎస్.సుబ్బలక్ష్మిని వివరణ కోరగా కె.గంగవరం పరిధిలోని శేరిలంకలో భూముల రీసర్వే జరిగిందని, ముమ్మిడివరం మండల పరిధిలో లంక గ్రామాల్లో రీసర్వే జరగలేదని, పెరుగులంక భూమిని సర్వేచేసి హద్దు నిర్ణయించాలని అక్కడ రైతులు కోరడంతో సర్వే చేపట్టామని, నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తహశీల్దార్ తెలిపారు.

18ఏళ్లు పైబడిన అందరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

అమలాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర తెలిపారు. సార్వత్రిక కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తీవ్రమైన కేసులను వైద్యశాలలకు సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. కేన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తూ అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ముమ్మిడివరం గేటు సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్, గుండెపోటు కేసుల నియంత్రణ చర్యల్లో భాగంగా కార్యక్రమం చేపట్టారన్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించడం స్క్రీనింగ్ పరీక్షల లక్ష్యమన్నారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి ఉపశమనం కలిగించేందుకు ఈవిధానం ఎంతో దోహదపడుతుందన్నారు. ర్యాలీలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమలత, డాక్టర్ సూర్యనగేష్, డాక్టర్ జాన్ లెవీ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, మిరియం కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విజయం పరీక్షలతోనే సాధ్యం

మామిడికుదురు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై విజయం సాధించాలంటే ప్రతీ ఒక్కరూ విధిగా పరీక్షలు చేయించుకోవాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి జేజే ప్రశాంత్ సూచించారు. కేన్సర్ పరీక్షలు అనే అంశంపై అవగాహన ర్యాలీని గురువారం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించారు. సీహెచ్‌వో సత్యవతి, సూపర్‌వైజర్ సత్యానారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అంబాజీపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తామని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి సెంటర్ వరకు కేన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఉప్పలగుప్తం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని భీమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రసన్నలక్ష్మి చెప్పారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం భీమనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేన్సర్‌పై విజయం- స్క్రీనింగ్‌తో సాధ్యం అన్న నినాదంతో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రాయుడు రామకృష్ణమూర్తి, పీహెచ్ఎన్ శుభారత్నం, హెచ్‌వీ సత్యవతి, జె.నాగవేణి, గౌతమి పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్

యానాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముందస్తు పరీక్షలతో (స్క్రీనింగ్‌టెస్ట్) కేన్సర్‌కు చెక్ పెట్టవచ్చని యానాం జిప్మెర్ మల్టీస్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్ యానాం శాఖ వైద్యులు అన్నారు. గురువారం ఆసుపత్రిలో కేన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. కేన్సర్‌పై రోగులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

కేంద్రం సీఆర్‌ఎఫ్ నిధులతో యానాంలో రోడ్ల అభివృద్ధి



సీఎంతో చర్చిస్తున్న మల్లాడి

యానాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సీఆర్‌ఎఫ్ నిధులతో యానాంలో రోడ్లకు మహర్దశ పట్టనుందని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఈమేరకు ఈఅంశాలపై పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, ప్రజాపనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఉన్నతాధికారులతో మల్లాడి సమావేశమయ్యారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రోడ్ల అభివృద్ధి ప్రతిపాదనను కేంద్రానికి పంపామన్నారు. పుదుచ్చేరికి కేంద్రం ఇచ్చిన బడ్జెట్‌లో ఈప్రతిపాదనకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రూ.20.47కోట్లతో కనకాలపేట నుంచి యానాంటౌన్, కురసాంపేట నుంచి సావిత్రినగర్ వరకు కొత్త రోడ్డు, గోపాల్‌నగర్ నుంచి మూడు తూములు వరకు డ్రైనేజీ అభివృద్ధి అలాగే రోడ్డు విస్తరణ చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు.దీనిపై చర్చించిన మల్లాడి పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి 15రోజుల్లో ఈప్రతిపాదనను కేంద్రానికి తీసుకువెళ్లనున్నారు.

ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 3శాతానికి పెంచడం హర్షణీయం



రాజోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 3శాతానికి పెంచడం పట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాజోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో ఇది వరకు ఇచ్చిన పారితోషికం కంటే రెట్టింపు పారితోషికం ఇస్తున్నందుకు, ఇంటి స్థలం కేటాయిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నిద్రావస్థలో ఉన్న క్రీడా రంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. ప్రతీ మండలంలోను క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ గ్రామీణ, ప్రాంతీయ క్రీడలను అభివృద్ధి చేస్తానని చెప్పడం, వివిధ క్రీడలకు సంబంధించిన కోచ్‌లను ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందని ఆయన పేర్కొన్నారు.

రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు

రెండు ఆలయాల్లో హుండీల చోరీలు

అల్లవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలతో వ్యాపారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దోపిడీ దొంగలు రెచ్చిపోయి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పోలీస్ నిఘా కొరవడిందని, సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని ఆరోపిస్తున్నారు. మంగళవారం రాత్రి అల్లవరంలో ఐదు షాపుల్లో చోరీలు జరగ్గా బుధవారం రాత్రి కొమరగిరిపట్నంలో సాయిబాబాగుడి, సీతారామాలయంలో దొంగలు రెండు హుండీలను ఎత్తుకెళ్లి వాటిలో నగదు దోచుకున్నారు. గురువారం స్థానికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ప్రధాన కూడళ్లలో సీసీకెమెరాలు అమర్చి పోలీసు నిఘాపెంచి శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్‌ఐ జి.హరీష్‌కు జనసేన నాయకులు పిండి గణపయ్య, కంకిపాటి వీరబాబు, పిండి సురేష్, కటికిరెడ్డి బాబి, కె.పవన్, పోచనపెద్ది వెంకటేష్ వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల రొయ్యల చెరువుల వద్ద మోటార్లు, ఆలయాల్లో హుండీలు, వ్యాపార దుకాణాల్లో దొంగతనాలు జరగడంపై ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సీఐ బి.ప్రశాంత కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దొంగతనాలపై దర్యాప్తు చేసింది.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

యానాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):యానాంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. యానాం సుభద్రనగర్‌లో రోడ్డుకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.14లక్షలు, రెసిడెన్షియల్ టాక్సీ, ఓనర్స్ కమ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు షెల్టర్ ఏర్పాటుకు రూ.9లక్షలు, కనకాలపేట ప్రాంతాలోని సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.45లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భూమిపూజ చేశారు. ఆర్‌ఏ మునిస్వామి, ప్రజాపనులశాఖ ఈఈ చంద్రశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, జేఈ పాల్గొన్నారు. యానాంలో వివిధ సమస్యలకు సంబంధించి స్థానిక అధికారులతో కలిసి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పర్యటించారు. సాగు, తాగునీరు పూర్తిస్థాయిలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో అరటికాలంక వద్ద గల పంప్‌హౌస్‌ను పరిశీలించారు. నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైన్ల పరిస్థితిని పరిశీలించారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణా తరగతులు

ఉప్పలగుప్తం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల5వ తేదీ నుంచి ప్రారంభమైన అండర్-14 బాలురు, బాలికల వాలీబాల్ శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. 19పాఠశాలలకు చెందిన 24మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నట్టు ఎంఈవో సత్తి సత్యకృష్ణ తెలిపారు. పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని పీడీ తెలిపారు.ముగింపు కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం లంక రాణి, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ వాహనం ఢీ: పడిపోయిన విద్యుత్‌స్తంభం

అల్లవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం ఊటగుంట సావరం రోడ్డులో గురువారం ఓఎన్జీసీ భారీ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో పెనుప్రమాదం తప్పింది. ఈసంఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోయి పక్కన ఉన్న నుయ్యిపై పడింది. బెండమూర్లంక-ఓడలరేవు సీసీరోడ్డు నిర్మాణ పనుల దృష్ట్యా ఓఎన్జీసీ భారీ వాహనాలు ఓడలరేవు టెర్మినల్‌కు వెళ్లేవిధంగా ఊటగుంట సావరం మీదుగా దారి మళ్లించారు. ఇరుకు రోడ్డు కావడంతో ఓఎన్జీసీ భారీ వాహనంఢీకొని విద్యుత్ స్తంభం విరిగిపడింది. బీవీసీ కళాశాల విద్యార్థులతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఈరహదారిలో విద్యుత్ స్తంభం పడిపోగా ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీస్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

సామాజ సేవకులను ఆదరించాలి

పి.గన్నవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజంలో కళాకారులను, కవులను ఆదరించాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో డిసెంబరు 12న జరగనున్న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న కార్యక్రమంపై పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. గద్దర్ జాతీయ సేవా పురస్కార అవార్డు ప్రదాన కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ ఉండ్రా జవరపు శాంతకుమారి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి 18 కలశల పూజ

మామిడికుదురు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిబాడవలోని తోరం బాబి స్వగృహం వద్ద అయ్యప్పస్వామి 18 కలశల పూజా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వాములు పేటతుళ్లి ఆడుతూ మేళతాళాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా వైనతేయ నదికి వెళ్లి అక్కడి నుంచి కలశాలతో గోదావరి జలాలు తీసుకువచ్చి కలశపూజ చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపించి అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పెదపట్నం గ్రామానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆలపించిన అయ్యప్పస్వామి గీతాలు, భజన కార్యక్రమం ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

కులగణనతో అన్ని కులాలకు న్యాయం

మామిడికుదురు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులాల జనాభాను లెక్కిస్తే తరతరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాధాన్యం లభిస్తుందన్నారు. దేశంలో కుల వ్యవస్థ బలంగా నాటుకుపోయిందని, కానీ అగ్రకులాల్లో కుల వ్యవస్థ కనిపించదన్నారు. దేశం ఆర్థికంగా ఎదగాలంటే కులవ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు.

మహిళ మెడలో బంగారు నగల చోరీ

ఐ.పోలవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని బంగారు నగలును ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి లాక్కుపోయాడు. మురమళ్ళకు చెందిన నూలు కమలావతి గురువారం కార్తీక వనసమారాధన భోజనానికి బంధువులతో కలిసి వెళ్తుంది. ఎదురుగా ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని రూ.5లక్షల విలువైన ఎనిమిది కాసుల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండ లాక్కొని ఉడాయించాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు జరుగుతోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అల్లవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు బ్రిడ్జిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం నుంచి కాండ్రేగుల సత్యనారాయణ(55), మందపాటి ఏడుకొండలు మోటార్‌సైకిల్‌పై బి.దొడ్డవరం వెళ్తున్నారు. బోడసకుర్రు బ్రిడ్జిపై ఆగిన లారీని తప్పించి వెళ్తుండగా మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న ఏడుకొండలు తీవ్రంగా గాయపడగా కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

రూ.10వేలు విరాళం

ఐ.పోలవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన అజ్జరపు పద్మవల్లి మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.10,116లు గురువారం ఆలయ సిబ్బందికి అందించారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం అందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

అమలాపురంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-19 విభాగాలకు గేమ్ ఆన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్టు కోచ్ మాగంటి అవినాష్ గురువారం తెలిపారు. అండర్-14 జిల్లా జట్టుకు డి.రాణాచతుర్వేది, ఎస్.ఫణీంద్ర, కె.శామ్యూల్‌మారిస్, అండర్-19 జిల్లా జట్టుకు జీఎస్ తేజ ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. క్రీడాకారులను ఆంధ్రా క్రికెట్ అకాడమీ కోచ్ నిమ్మకాయల శ్రీనివాస్, కూచిమంచి కృష్ణ అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

మండపేట నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండపేటలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవ ఊరేగింపు పట్టణ పురవీధుల్లో నిర్వహించారు. స్వామివారికి విశేషపూజలు జరిగాయి. అర్చకులు చినబాబు, పెదబాబు సారధ్యంలో సాయంత్రం స్వామివారికి దివ్య తిరుకల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల ప్రారంభం

ద్రాక్షారామ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జలజీవన్ పథకంలో హసన్‌బాదలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ప్రారంభించారు. నాలుగు కిలోమీటర్లు నిడివిగల పైపు లైను పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

- ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు
- పాఠ్య పుస్తకాలు, బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ
- కళాశాల టైమింగ్స్ మార్పు





రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ప్రోగ్రెస్ కార్డులు.

రాయవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడం ద్వారా ఉత్తీర్ణత శాతం పెంచి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఫలితాలు సాధించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఈఏడాది నుంచి అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, కళాశాలలో నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేసేలా ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు చూపించి వారితో సంతకాలు చేయించి తిరిగి కళాశాలకు తెచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు.

పాఠ్య పుస్తకాలు, బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ:

విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ చొరవతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది ఇంటర్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేసింది. పుస్తకాలు కొనలేక చదువు భారంగా ఉన్నపేద విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందించడం పేదవిద్యార్థులకు ప్రయోజనం చేకూరింది.

కళాశాల టైమింగ్స్ మార్పు:

ప్రభుత్వం జూనియర్ కళాశాల ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4గంటలకు వరకు పనిచేసేవి. ఈఏడాది ప్రభుత్వం కళాశాల సమయాల్లో మార్పులు చేసి నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించి 4నుంచి 5గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

పెరిగిన అడ్మిషన్లు:

గతంలో కంటే రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు సంఖ్య పెరిగాయి. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపర్చడంతో గతంలో 70మాత్రమే ఉన్న విద్యార్థుల సంఖ్య ఈఏడాది 130కి పెరిగింది.

వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో మేలు:



చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇంటికి పంపించడం ద్వారా విద్యార్థి ఏవిధంగా చదువుతున్నాడనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించడంతో పాటు వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చిన నమూనా ప్రోగ్రెస్ కార్డులు కళాశాలకు చేరాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. **ఎం.రామారావు ప్రిన్సిపాల్, రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల.**

చెత్త నుంచి సంపద కేంద్రాల పునరుద్ధరణ

జిల్లా పంచాయతీ అధికారి శాంతిలక్ష్మి



ఇప్పనపాడులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లాపంచాయతీ అధికారి శాంతిలక్ష్మి తదితరులు

మండపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు మూలనపడిన చెత్త సంపద కేంద్రాలను పునరుద్ధరించి, చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి చెప్పారు. మండలంలోని ఇప్పనపాడు, అర్తమూరు గ్రామాల్లో డీపీవో గురువారం పర్యటించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆమె మండలంలో పర్యటించారు. అర్తమూరు. ఇప్పనపాడు పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం రెండు గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు ఆమె సూచనలు చేశారు. జిల్లాలో 263 చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 190వరకు పనిచేస్తున్నాయని ఆమె తెలిపారు. మిగిలినవి కూడా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు పంచాయతీ సిబ్బందితో పాటు గ్రామాల్లో ఉండే డ్వాక్రా యానిమేటర్ల సేవలను వినియోగించుకునేందుకు కలెక్టర్ అనుమతి కోరతామన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులు వసూళ్ల కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించామన్నారు. ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాసరావు, ఇప్పనపాడు, అర్తమూరు పంచాయతీ కార్యదర్శులు ఎస్.వి.వి.సుబ్బారావు, అనిల్ పాల్గొన్నారు.

సోలార్ గ్రామంగా వానపల్లిని అభివృద్ధి చేస్తాం



సోలరైజేషన్‌పై ఎస్ఈ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వానపల్లి గ్రామాన్ని నూరుశాతం సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తామని కోనసీమ సర్కిల్ ఎలక్ట్రికల్ ఎస్ఈ రాజబాబు తెలిపారు. గురువారం వానపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన సోలార్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఈ రాజబాబు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సోలార్ సూర్యఘర్ ఆవాజన యోజన పథకంలో భాగంగా జిల్లాలో మోడల్ విలేజీగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు స్వర్ణ వానపల్లిలో భాగంగా ప్రతి ఇంటికి రాయితీపై సోలార్‌ప్లేట్స్ వేసుకునేందుకు వానపల్లి పరిధిలోని గ్రామాల ప్రజలు ముందుకు రావాలన్నారు. త్వరలోనే జిల్లాలో వానపల్లిని సోలార్ మోడల్ విలేజీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ ఎం.రవికుమార్, కొత్తపేట ఏడీఈ చిట్టిరాజు, ఎఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండపేటలో శుక్రవారం విద్యుత్‌లైన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ కెరత్నాలరావు తెలిపారు. పట్టణంలో మారేడుబాక, ఫైర్‌స్టేషన్, మారేడుబాక మహిళానగర్, ఆనంద్‌కాలనీ, వీర్రాజునగర్, తహశీల్దార్ కార్యాలయం, కేపీరోడ్డు, రావిచెట్టు, సూర్యారావుపేట, కొండపల్లివారివీధి, తెనుకలవీధి, పాతఆంధ్రాబ్యాంక్‌వీధి, రజకపేట, ఎంపీడీవో కార్యాలయం, బాపూజీ స్కూల్ ఏరియా, బ్యాంకుకాలనీ, శ్రీనగర్, రాజారత్న రోడ్డు, గాంధీనగర్, కలవపువ్వు సెంటర్, సైదులపేట, పోలీస్‌స్టేషన్‌వీధి, రథంగుడి, సంకావారివీధి, రావులపేట, ధర్మగుండంచెరువు, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, సంగంపుంత, పార్థసారధినగర్, కరాచీసెంటర్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఆందోళన



ఈతకోట పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ శేఖర్

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లింలు ఆందోళన చేశారు. రావులపాలెం మండలం ఈతకోట పంచాయతీ పరిధిలోని నెక్కంటి కాలనీకి చెందిన మీరాబి అనే ముస్లిం మహిళ మృతిచెందింది. దీంతోమీరాబి మృతదేహంతో గురువారం స్థానిక ముస్లింలు పంచాయతీ కార్యాలయం వద్ద బరియల్‌గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలని నిరసన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న శేఖర్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్, ఎస్ఐ చంటితో కలిసి అక్కడికి వెళ్లి వారితో చర్చలు జరిపారు. బరియల్ గ్రౌండ్‌కు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ చర్చల్లో అధికారులతో పాటు గ్రామస్థులు యర్రంశెట్టి బుజ్జి, మిరియాల రాము, ఏనుగుపల్లి నాగార్జున, మాసాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు.

మండపేటలో కేన్సర్‌డే

మండపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండపేటలో గురువారం ప్రపంచ కేన్సర్ డేను గురువారం కమ్యూటీని పారా మెడికల్, ప్రైమరి కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆలమూరు రోడ్డులో వున్న వైష్ణవి వోకేషనల్ కళాశాలలో కేన్సర్‌పై విద్యార్థులకు వైద్యులు డాక్టర్ జ్యోతిర్మయి వివరించారు. నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్‌క్యూరీ జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా కేన్సర్‌డేను జరుపుకుంటున్నామన్నారు. క్యూరీ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కోనే వీర్రాజు, పీఎంపీలు కె.సత్యనారాయణ, వానపల్లి కనకరాజు, కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విక్టరీ వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుకలు

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విక్టరి సంస్థల అధినేత రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి(విక్టరి వెంకటరెడ్డి) పుట్టినరోజు వేడుకలు జరిగాయి. పేదలకు రగ్గులు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ఆత్రేయపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. సీఆర్సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 50మంది వృద్ధులకు శీతాకాలం సందర్భంగా రగ్గులు పంపిణీ చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

రాయవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



పీహెచ్‌సీలో వైద్యసేవలపై అడిగి తెలుసుకుంటున్న నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ

కపిలేశ్వరపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన డా. ఎంఎ అనూప్, డా. శ్రీహరిమాధవన్‌కుట్టినైర్ అన్నారు. గురువారం వాకతిప్ప పీహెచ్‌సీని వారు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలో విభాగాలైన ఫార్మసీ, లేబరేటరీ, అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాలు, లేబర్ రూం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తదితర అంశాలపై పీహెచ్‌సీ వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ల్యాబ్‌లో జరిగే పరీక్షలు పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలలో నార్మల్ డెలివరీల కోసం ఫీల్డ్‌లో ఉన్న ఆరోగ్య సిబ్బంది గర్భిణులను ప్రోత్సహించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. వాటర్ క్వాలిటీ టెస్ట్‌లు ప్రతీ వారంనిర్వహించాలని వారు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పి.చంద్రమౌళి, డాక్టర్ సీహెచ్‌రాకేష్‌కృష్ణచౌదరి, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ సునీత, రామచంద్రపురం డివిజినల్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు, ఎంపీహెచ్‌ఈవో బిషప్, సూపర్‌వైజర్ కామేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కొత్తపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): 104లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు గురువారం యూనియన్ జిల్లా నాయకులు హెల్త్‌నోడల్ అధికారి డాక్టర్ సుమలతను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే మంజూరు చేయాలని కోరారు. వేతనాలు లేక కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్స్ డీఈవోలకు జీవో-7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరవిందో యజమాన్యం అక్రమంగా వసూళ్ళు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74మంది ఉన్న డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, 104వాహనాలకు ఫిటినెస్, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని వినతిలో కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పలివెల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ పేమెంట్ బ్యాంకింగ్ ద్వారా సామాజిక ప్రయోజనాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న సామాజిక ప్రయోజనాలు పొందడానికి తపాలశాఖలో పోస్ట్‌పేమెంట్ బ్యాంకింగ్ అకౌంట్లకు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ చేయించుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలు డైరెక్ట్ బెనిఫిషియర్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందచేసేందుకు నూతన ఖాతాలు తెరచేందుకు, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కొరకు ఆధార్ లింక్ చేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్‌పీసీఐ యాక్టివేషన్ అన్ని పోస్టాఫీసులు ద్వారా చేయడం జరుగుతుందన్నారు. ఖాతాలున్న వారు పోస్టాఫీసుల్లో సంప్రదించి లింక్ చేయించుకోవాలని కోరారు.



ఆలమూరు: పెదపళ్లలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ దృశ్యం



కపిలేశ్వరపురం: తాతపూడిలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదపళ్లలో కేన్సర్ అవగాహన ర్యాలీ

ఆలమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం రోజున ఎన్‌సీడీ సిడి3.0లో భాగంగా యూనివర్సల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జనాభా ఆధారిత స్క్రీనింగ్ ప్రోగ్రామ్ దేశంలో ఎన్‌హెచ్‌ఎం కింద సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా రూపొందించిన కార్యక్రమంలో 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ ఎంలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

కపిలేశ్వరపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సచివాలయాలలో ఆరోగ్య సిబ్బంది ద్వారా క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రత్నకుమారి ఆదేశాల మేరకు క్యాన్సర్ పరీక్షలపై అవగాహన నిమిత్తం ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ పరీక్షలపై అవగాహన నిమిత్తం ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం, ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుంచి రక్ష అంటూ నినాదాలు చేశారు. త్వరలోనే ఆరోగ్య సిబ్బంది ఇంటింటా పర్యటించి 18 సంవత్సరాల పైబడిన వారందరినీ పరీక్షించి క్యాన్సర్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరుగులంక వివాదంపై ఉమ్మడి సర్వే

- మూడు రోజుల్లో సర్వే నివేదిక సమర్పిస్తామన్న అధికారులు



శేరిలంక, గురజాపులంక పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

కె.గంగవరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శేరిలంక గ్రామ సరిహద్దుల్లో గోదావరివరదల సమయంలో పెరుగులంక ఏర్పడింది. దీనిని గత 40 సంవత్సరాలుగా శేరిలంక గ్రామస్తులు ఉపయోగించుకుంటున్నారు. ఈ సంవత్సరం ఇది తమ గ్రామానికి చెందినది అని ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ శివారు గురజాపులంక గ్రామస్తులు తమకు చెందుతుందని యడ్ల రవికుమార్, కన్నీడి రాధాకృష్ణ, కన్నీడి సుబ్బారావు తదితరులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అమలాపురం రెవెన్యూ డివిజన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ముమ్మిడివరం తహశీల్దార్ విచారణచేసి ఇది రెండు గ్రామాలకు చెందిన సున్నితమైన సమస్య కావడం వలన అమలాపురం, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్‌లు, సర్వేయర్‌ల సమక్షంలో సర్వే నిర్వహించాలని నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించారు. గురువారం అమలాపురం, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారుల ఆదేశాలతో కె.గంగవరం, ముమ్మిడివరం తహశీల్దార్‌లు, మండల సర్వేయర్‌లు, పోలీసులు సమక్షంలో ఇరు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. కె.గంగవరం మండల అధికారులతో గురజాపులంక సరిహద్దులు, ముమ్మిడివరం మండల అధికారులతో శేరిలంక గ్రామ సరిహద్దులు సర్వే నిర్వహించారు. మూడు రోజుల్లో సర్వే అధికారులు నివేదిక తయారుచేసి ఇస్తారని దానిని జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, వారి ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని కె.గంగవరం తహశీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. సమావేశంలో కె.గంగవరం ఎస్ఐ ఎస్.కె.జానీబాషా, శేరిలంక గ్రామ సర్పంచ్ కొండేపూడి భద్రరావు, ఎంపీటీసీ కొండేపూడి గంగాభవాని అప్పారావు, గ్రామ పెద్ద లు కొడేపూడి చంటి, గుత్తాల శ్రీనివాసరావు, గిడ్డి బాలకృష్ణ, నరేంద్ర, బీర చిన్న అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీవోకు ప్రధాని మోదీ చిత్రపటం అందజేత



ఆర్డీవోకు ప్రధాని మోదీ చిత్రపటం అందజేస్తున్న నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు7(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిలకు బీజేపీ నాయకులు గురువారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటం అందచేశారు. ఆర్డీవో కార్యాలయంలో నరేంద్ర మోదీ చిత్రపటం పెట్టాలని కోరారు. బీజేపీ నాయకులు కె.హరిబాబు, బుల్లబ్బులు, కేశవ రాఘవేంద్ర, నలాది సతీష్, సత్యనారాయణ, గానాల కల్యాణ్, శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేలపై దాడి అమానుషం

కె.గంగవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ శాసనసభ సమావేశాల్లో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలపై ఎన్‌సీపీ కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలు దాడిచేయడం అమానుషమని బీజేపీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి, సీనియర్ నాయకుడు కర్రి చిట్టిబాబులు అన్నారు. ఆర్టికల్ 370, 35ఏలపై చర్చల సందర్భంగా ఈ దాడి జరిగింది.

ఈనెల 13వరకు ఏకాదశ రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో పార్వతీ అగస్త్యేశ్వరస్వామి

కపిలేశ్వరపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లూరులో ఉన్న పార్వతీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని ఈనెల 13వరకూ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో శ్రీ కంఠం మల్లేశ్వరశర్మ అర్చకత్వంలో పలువురు పండితులు స్వామివార్కి ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు, నందీశ్వరునికి అభిషేకం, రుద్రహోమం, వేద మంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. ఈనెల 13న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్థులతో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

లొల్లలో బీజేపీ సభ్యత్వ నమోదు



లొల్లలో బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

రాయవరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల గ్రామంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో 128వ బూత్‌లో కార్యకర్తలకు పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, భారతీయ జనతా పార్టీ నాయకులు ముప్పాటి కృష్ణ, కోన సత్యనారాయణ, వల్లభనేని రవీంద్రబాబు, కొత్తపల్లి శ్రీదేవి, అంగర జనార్ధనస్వామి, కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



మాచరలో ప్రతిష్ఠించనున్న శ్రీ అభయ అంజనేయస్వామి

కపిలేశ్వరపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచరలో ఈనెల 8న జరిగే శ్రీ అభయ ఆంజనేయస్వామి(45 అడుగులు) విగ్రహప్రతిష్ఠ సందర్భంగా రెండో రోజు గురువారం విగ్రహప్రతిష్ఠ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు పెదపూడి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి లక్ష్మణాచార్యులు బ్రహ్మత్వంలో వేదస్వస్తి, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, వాస్తుపూజ, చతుర్థశ కలశారాధన, గోదృష్టి, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు హోమం, మహాశాంతిహోమం, శిలామయం విగ్రహానికి పంచామృతాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో బాణాసంచానడుమ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. 8న ఉదయం గం 7.13కు శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ, శిలామయ ప్రతిష్ఠ నిర్వహణ అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలి



వలివల ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ అమృతరావు

రావులపాలెం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సక్రమమైన మార్గంలో నడుచుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పాస్టర్ పన్ని అమృతరావు అన్నారు. ఈతకోట గంటి రోడ్డులో ఉన్న వలివల స్వస్థత శాల ప్రార్థన మందిరం 9వ వార్షికోత్సవ మహాసభలను అమృ తరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు భక్తులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

బీఎల్‌వో జీతాలు, బూత్ నిర్వహణ ఖర్చులు చెల్లించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోలు

ద్రాక్షారామ, నవంబరు (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బూత్‌ల నిర్వహణ ఖర్చులు చెల్లించాలని, 3 ఏళ్లగా బీఎల్‌వోలకు బకాయిలు చెల్లించాలని గురువారం రామచంద్రపురం తహసీల్దార్‌కు నియోజకవర్గ వీఆర్‌వోలు వినతి పత్రం అందజేశారు. బూత్‌ల నిర్వహణకు రూ.15 వేలు ఖర్చు అవ్వగా రూ.5 వేలు చెల్లించారని మిగిలిన మొత్తం చెల్లించాలని కోరగా బడ్జెట్ వచ్చిన తరువాత చెల్లిస్తామని తహసీల్దార్, ఆర్‌డీవో చెప్పారని గుర్తుచేశారు. ప్రస్తుతం బడ్జెట్ వచ్చినట్లు తెలిసిందని బూత్‌నిర్వహణ ఖర్చులు చెల్లించాలని కోరారు. అదేవిధంగా రెవెన్యూయేతర సర్వే పనుల నుంచి వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వోల సంఘం రామచంద్రపురం మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, కాజులూరుమండల అధ్యక్షుడు కొమ్ము వెంకటేశ్వరరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

భూ సర్వే సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కె.గంగవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): భూ సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కారం చేయడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి, డిప్యూటీ తహశీల్దార్ మురళీలు అన్నారు. గురువారం బాలాంత్రంలో జరిగిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ఏఏ సమస్యలు పరిష్కారానికి ఏవిధంగా దరఖాస్తు చేయాలో వివరించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి సాంబశివరావు, మాజీ సర్పంచ్ తోలేటి శ్రీకృష్ణమూర్తి, కూటమి నాయకులు బుజ్జి, రాంబాబు, వెంకటరమణ, వీఆర్‌వో జె.సత్యనారాయణ పాల్గొన్నారు.